# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 07 సెప్టెంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 72




విధ్వంసానికి రెండోవైపు..


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# సభ సమరానికి సై

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
## వెయ్యి రోజుల పాలనపై ప్రత్యేక చర్చ

- అందరి గురి 22ఏ పైనే
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- 4-6 రోజులు కొనసాగే అవకాశం
- వెయ్యిరోజుల పాలనలో అభివృద్ధిపై వివరించనున్న ప్రభుత్వం
- నిషేధిత అస్త్రంతో విపక్షాలు..తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్న సర్కారు
- హామీల వైఫల్యాలు ఎజెండాగా ఢీకొట్టనున్న భారాస, భాజపా
- నేడు సెంట్రల్ హాల్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

'తెలంగాణ సమగ్ర శిక్షణ'.. 'పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా'.. 'మెట్రో రైలు'కు సంబంధించిన ఆడిట్ రిపోర్టులను సభ ముందుంచుతారు. అనంతరం ఉభయసభలు వాయిదా పడతాయి. తర్వాత శాసనసభ, మండలికి సంబంధించి వేర్వేరుగా 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ)' సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో శాసనసభ, శాసనమండలిని ఎన్నిరోజుల పాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చించాలి? అనేది నిర్ణయిస్తారు.

-2లో



-2లో

# అసెంబ్లీకి రాకపోతే కేసీఆర్ రాజీనామా చేయాలి

## ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకొని ఉపఎన్నికలకు అవకాశమివ్వాలి
## మహాధర్నాలో కాంగ్రెస్ నేతల డిమాండ్

అసెంబ్లీకి రాలేని పరిస్థితి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికలు పెట్టే అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివారం 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ'(పీసీసీ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

## మిస్టర్ డీజీపీ. నన్ను అసభ్యంగా కామెంట్ చేసిన
# పోలీస్‌ను అరెస్ట్ చెయ్యి



- పరీక్ష పాస్ అయి డీజీపీ అయినవా.. రికమండేషన్ లో జాబ్ లోకి వచ్చినవా
- అధికారం కోసం ఉద్యమకారులను వాడుకోని రేవంత్ రెడ్డి మోసం చేశా డు
- అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణీత కాల వ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

-2లో

అసలు తెలంగాణ ఉద్యమంతో సంబంధమే లేని రేవంత్ రెడ్డి ఉద్యమకారులు నమ్మలేదని కవిత అన్నారు. ఆయన పక్కన కోదండ రాం సర్ ను చూసి రేవంత్ రెడ్డిని నమ్మారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న వారికి చీమకాలంత పనికూడా చేయలేదని విమర్శించారు. ఇప్పటికే ఎన్నో ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు ఇంకా వాళ్లకు ఇచ్చిన హామీల కోసం ఉద్యమాలు చేయాలా? అని ప్రశ్నించారు.

## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే
# ప్రభుత్వ లక్ష్యం

***ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ ఆషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పదేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు.***



హైదరాబాద్: ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, ఈహెచ్ఎస్ పథకం అమలులో రాజీ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమవారేనని, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు ఒడిదొడులకు లోనవ్వద్దనే ఉన్నతాశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు చేస్తోందన్నారు. ఇందులో ఇప్పటికే 354 ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా, మరికొన్నింటిని డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్లు చెప్పారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



-3లో

## 22ఏ సమస్య ఎందుకొచ్చింది?



-3లో

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా
## విధ్వంసమే

## అనుచిత భాష వినడానికి కేసీఆర్
# అసెంబ్లీకి రావాలా?

## ముఖ్యమంత్రిగానే ఆయన సభలో అడుగుపెడతారు
## అసెంబ్లీ నెల రోజులు నిర్వహించాలి
## భారాస ఎల్పీ సమావేశ వివరాలను వెల్లడించిన హరీశ్‌రావు



హైదరాబాద్: 'ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి అనుచిత భాష వాడుతున్నారు. అలాంటి గౌరవం లేని సభకు కేసీఆర్ వెళ్లాల్సిన అవసరం లేదు. సభ్య సమాజం తలదించుకొనే వ్యాఖ్యలతో జరుగుతున్న చర్చలో తెలంగాణ సాధించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాల్గొనకూడదని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా నిర్ణయించారు' అని భారాస శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు వెల్లడించారు. ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నేతలను సభలో అవమానిస్తే... వారు సమావేశా లను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రులుగా అడుగుపెట్టారని, కేసీఆర్ కూడా అదేబాటలో మళ్లీ సీఎంగానే శాసనసభలో అడుగుపెడతారని స్పష్టంచేశారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో ఆదివారం భారాస ఎల్పీ సమావేశం నిర్వహించారు.అనంతరం చర్చించిన వివరాలను పార్టీ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, విజయుడు, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. "కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెల రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నడపాలని బీఏసీ సమావేశంలో భారాస పక్షాన గట్టిగా డిమాండ్ చేయాలని నిర్ణయించాం. 22ఏ కింద భూములను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బందిపెడుతున్న తీరుపై, కరెంట్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ ఫెయిల్యూర్ వంటి అన్ని అంశాలపైనా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారమవుతోంది. విద్యార్థుల పక్షాన అవసరమైతే సభను స్తంభింపజేసైనా న్యాయం జరిగే దాకా కొట్లాడతాం. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో కేసీఆర్ స్వయంగా లక్షల మందితో ప్రత్యక్ష ఉద్యమానికి నాయకత్వం వహిస్తారు. పాలన చేతకాక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ.. ఆ అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డి 'కేసీఆర్ రాజీనామా' అంటూ కొత్త డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు.

వేగుచుక్క

# సభా సమరానికి సై

**హోరాహోరీకి అధికార, ప్రతిపక్షాలు రెడీ 22ఏ, హామీలపై పోరుకు ప్రతిపక్షాలు సిద్ధం కేసీఆర్ సభకు రావాలని కాంగ్రెస్ పట్టు కృష్ణా జలాలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఫీజు రీయింబర్స్మెంట్ పై బీజేపీ కీలక బిల్లులు పెట్టనున్న ప్రభుత్వం తొలిరోజు పలు వార్షిక నివేదికలు సెంట్రల్ హాల్ను ప్రారంభించనున్న సీఎం**



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వాడీవేడి చర్చలు జరగనున్నాయి. వెయ్యి రోజుల ప్రజాపాలనలో సాధించిన విజయాలను ఘనంగా చాటిచెప్పేలా ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సంక్షేమం, అభివృద్ధిపై అంశాల వారీగా వివరించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల దుమారం లేపిన 22ఏ భూముల వ్యవహారంపై ప్రధానంగా అసెంబ్లీలో చర్చించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమవుతోంది. ఇదే విషయంపై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండడంతో.. విపక్షాల విమర్శలు, ఆరోపణలకు దీటుగా సమాధానమిచ్చేలా సర్కారు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం భారాస సహా భాజపా కూడా ఇదే అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తుండడంతో.. భూముల వ్యవహారంపైనే అవసరమైతే రెండు రోజులు చర్చించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను ప్రధాన ఎజెండాగా భారాస, భాజపా చర్చకు సిద్ధమవుతున్నాయి. తొలిరోజు సమావేశాల ప్రారంభానికి ముందు కొత్తగా నిర్మించిన 'సెంట్రల్ హాల్'ను సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారు. దీనికి మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరుపెట్టారు. ఈ కార్యక్రమం అనంతరం శాసనసభ, మండలి ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. తొలిరోజు ఇరుసభల్లోనూ ప్రశ్నోత్తరాలను నిర్వహించనున్నారు. 'తెలంగాణ సమగ్ర శిక్షణ'.. 'పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా'.. 'మెట్రో రైలు'కు సంబంధించిన ఆడిట్ రిపోర్టులను సభ ముందుంచుతారు. అనంతరం ఉభయసభలు వాయిదా పడతాయి. తర్వాత శాసనసభ, మండలికి సంబంధించి వేర్వేరుగా 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ)' సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో శాసనసభ, శాసనమండలిని ఎన్నిరోజుల పాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చించాలి? అనేది నిర్ణయిస్తారు. ఈ సమావేశాలు సుమారు 4 నుంచి 6 రోజుల పాటు జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చించాల్సిన అంశాల ప్రాధాన్యాన్ని బట్టి సభ నిర్వహణ రోజులను పొడిగించే అవకాశాలుంటాయి.

**నేడు సీఎల్పీ సమావేశం**

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల విమర్శలను వాస్తవిక సమాచారం, దీటైన సమాధానాలతో ఎదుర్కోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని అసెంబ్లీ వేదికగా తిప్పికొట్టాలని రంగం సిద్ధం చేస్తోంది. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విడిగా కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం కూడా జరిగే అవకాశాలున్నాయని పార్టీవర్గాలు వెల్లడించాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారని నేతలు తెలిపారు. ప్రధానంగా 22ఏ భూముల అంశంపై అసత్య ప్రచారం ఎక్కువగా చేస్తున్నారని, భారాస పాలనలోనే ఇది ఉందనే విషయాన్ని ఆధారాలతో సహా సభలో చెప్పాలని ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైన సందర్భంగా ఇప్పటివరకూ చేపట్టిన సంక్షేమ పథకాలు, వాటివల్ల ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు, నిధుల వినియోగంతో పాటు.. సాధించిన విజయాలు తదితర అంశాలను సమగ్రంగా శాసనసభ ద్వారా ప్రజలకు తెలపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలను పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా పేదలందరికీ ఇస్తున్న వైనాన్ని ప్రముఖంగా చెప్పాలని కాంగ్రెస్ వ్యూహాలు సిద్ధం చేస్తోంది.

**అన్ని వర్గాలకూ మోసం.. నినాదంతో భారాస**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తవుతున్నా.. అన్ని వర్గాల ప్రజలకు తీరని ద్రోహమే జరిగిందని, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను ఈ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందనే నినాదాన్ని అసెంబ్లీ, మండలిలో బలంగా వినిపించాలని భారాస నిర్ణయించింది. ప్రజాసమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెలరోజుల పాటు సమావేశాలు నడపాలని డిమాండ్ చేయనుంది. సాగునీటి ప్రాజెక్టులు, 22ఏ భూముల నిషేధం వ్యవహారం, నిరుద్యోగులు, విద్యార్థులు, తదితర అంశాలపై చర్చించేందుకు భారాస సన్నద్ధమవుతోంది.

**నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గళమెత్తనున్న భాజపా**

నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని భాజపా సభ్యులు నిర్ణయించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాతో రైతులు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కాక ఆర్థికంగా కుదేలవుతున్నారని, ఆరు గ్యారంటీలను నెరవేర్చలేదని ఈ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని పార్టీ శాసనసభాపక్షం నిర్ణయించింది. కనీసం 15 రోజులపాటు సభను నిర్వహించాలని భాజపా సభ్యులు డిమాండ్ చేయనున్నారు.

## అసెంబ్లీకి రాకపోతే కేసీఆర్ రాజీనామా చేయాలి



హైదరాబాద్: నెలనెలా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష నేతగా వెయ్యిరోజులుగా అసెంబ్లీకి హాజరు కాకుండా ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రతిపక్ష పాత్ర పోషించమని ప్రజలు భారాసకు అవకాశమిస్తే కేసీఆర్ ఫాంహౌస్‌కే ఎందుకు పరిమితమయ్యారని.. కుమారుడు, అల్లుడు అసెంబ్లీకి రావద్దంటున్నారా? కారణాలేమిటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత పాత్ర అంటే సీఎం తర్వాతి స్థానం అని, ఆ పాత్రను ఎందుకు పోషించడం లేదని నిలదీశారు. అసెంబ్లీకి రాలేని పరిస్థితి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికలు పెట్టే అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివారం 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ'(పీసీసీ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ నేతలు జగ్గారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ "ధనిక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణను బీద రాష్ట్రంగా మార్చారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి ఎప్పుడు అవకాశం ఇవ్వాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ప్రతిపక్ష నేత హోదాని కేసీఆర్ అపహాస్యం చేయడం సరికాదు. ప్రభుత్వం తప్పులు చేస్తే ప్రతిపక్షాలు ఎత్తిచూపాలి గానీ అసత్యాలు ప్రచారం చేయడం సబబు కాదు. గతంలో కళాకారులను అవమానించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రజల ఆకాంక్షలు ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తోంది. కేటీఆర్ చదువు గురించి మాట్లాడుతున్నారు. చదువు కాదు.. సంస్కారం కావాలి. మేం బాగా పనిచేస్తున్నందున

మళ్లీ మళ్లీ గెలిచి

2040 వరకూ అధికారంలో ఉంటాం. తప్పిదాలు జరిగితే సరిదిద్దుకుంటాం. భాజపా నేతలు వ్యంగ్యంగా మాట్లాడటం తప్ప చేసిందేమీ లేదు. భాజపాలో బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, అర్వింద్ ఏం చేస్తున్నారు? తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన చేశారని మోదీ వద్దకెళ్లి వారు ఎందుకు చెప్పలేకపోతున్నారు? బీసీ కులగణన అంశం జనగణనలో చేసేలా మెడలు

## దిల్లీలో కుప్పకూలిన హాస్టల్



దిల్లీ: దేశ రాజధానిలో సుమారు యాభై ఏళ్ల క్రితం నిర్మించిన ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నలుగురికి ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. శిథిలాల కింద పలువురు ఉన్నారని భావిస్తున్నారు. వారిలో చాలామంది ఫోన్లుచేసి తమను కాపాడాలని వేడుకున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్‌వద్ద కిక్కిరిసిన ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిని విద్యార్థుల వసతి గృహంగా వాడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని కాపాడేందుకు ఆక్సిజన్ సిలిండర్లను లోపలకు జారవిడిచారు. రాత్రి వరకు 8 మందిని బయటకు తీసుకురాగలిగారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేలోపే నలుగురు చనిపోగా.. మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మరో ముగ్గురికి చికిత్స కొనసాగుతోంది. భవనం బేస్‌మెంట్‌లో కొన్ని మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇటీవలి వర్షాలకు బేస్‌మెంట్లో నీరు చేరి, పునాదుల్ని బలహీనపరిచిందని, అదే ప్రమాదానికి దారి తీసి ఉంటుందని భావిస్తున్నారు. ఆకస్మికంగా భూ ప్రకంపనల్లా అనిపించడంతో స్థానికులు ఉలిక్కిపడి బయటకు వచ్చి చూసేసరికి శిథిలాల దిబ్బ మిగిలింది. ముఖమంతా దుమ్ముతో.. శిథిలాల కింద ఒక విద్యార్థి రక్తమోడుతూ ఉన్నట్లు వీడియో లభ్యమైంది. కాపాడాలంటూ పలువురు ఆర్తనాదాలు చేశారని సమీప భవనాలవారు చెప్పారు.

## మిస్టర్ డీజీపీ. నన్ను అసభ్యంగా కామెంట్ చేసిన పోలీస్ ను అరెస్ట్ చెయ్యి

**హైదరాబాద్:**

తనపై అసభ్యకరంగా కామెంట్లు చేసిన కానిస్టేబుల్ ను రాష్ట్ర డీజీపీ కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవటంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా కేసు పెట్టకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. అసలు పరీక్ష పాసయ్యే ఆయన డీజీపీ అయ్యారా? ఆయనకు చట్టం తెలుసా అని కవిత నిలదీశారు. వెంటనే కానిస్టేబుల్ పై చర్యలు చేపట్టకుంటే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం రేవంత్ రెడ్డి ఉద్యమకారులను వాడుకొని మోసం చేశాడని కవిత అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వారికి నిర్ణీత కాల వ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పరీక్ష పాసయ్యే డీజీపీ అయ్యారా?**

సోషల్ మీడియాలో తనను అసభ్యంగా దూషించిన కానిస్టేబుల్ పై వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అంత అసభ్యంగా కామెంట్లు చేసిన వ్యక్తిని కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారా అని ప్రశ్నించారు. అతనిపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 356, సెక్షన్ 79, ఐటీ చట్టాలు ఏం చెబుతున్నాయో డీజీపీ చదువుకోవాలని సూచించారు. మహిళలను ఒక్క పదం అసభ్యంగా మాట్లాడిన సరే 3 ఏళ్ల పాటు శిక్ష వేసేలా చట్టాలు ఉన్నాయని అవి డీజీపీకి తెలియదా? అంటూ కవిత నిలదీశారు. అసలు డీజీపీ పరీక్ష పాసయ్యే పోలీసు అధికారి అయ్యాడా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. 20 ఏళ్లు ప్రజా జీవితంలో ఉండి, ఎంపీగా ఎమ్మెల్సీ, ఒక పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న తనకే రక్షణ లేకపోతే...సాధారణ మహిళలకు ఏం రక్షణ ఇస్తారని



నిలదీశారు. మీకు కూడా ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిని కూడా ఇలాగే కామెంట్లు చేస్తే వదిలేస్తారా అంటూ కవిత అడిగారు. ఈ విషయంలో డీజీపీ బాధ్యత లేకుండా సెన్సిబులిటీ లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కానిస్టేబుల్ పై కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని కవిత హెచ్చరించారు. ఇప్పుడున్న డీజీపీ బాధ్యతలు చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరిగిందని కవిత అన్నారు. ఖమ్మం వెళ్లి స్వయంగా డీజీపీయే రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ పెరిగిందంటూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టాల్సిందెవరంటూ కవిత ప్రశ్నించారు. అటు హేట్ స్పీచ్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి తీసుకొస్తామని చెప్పిన బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తేవాలన్నారు.

**ఉద్యమకారులకు నిర్ణీత కాలవ్యవధితో కూడిన వాగ్దానం చేయాలి**

అధికారంలోకి రావటానికి తెలంగాణ ఉద్యమకారులను రేవంత్ రెడ్డి ఉపయోగించుకున్నారని కవిత అన్నారు. ఎన్నికలకు ముందుకు దాదాపు వాళ్ల కాళ్లు పట్టుకున్నంత పనిచేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు తెలంగాణ ఉద్యమంతో సంబంధమే లేని రేవంత్ రెడ్డి ఉద్యమకారులు నమ్మలేదని కవిత అన్నారు. ఆయన పక్కన కోదండ రాం సర్ ను చూసి రేవంత్ రెడ్డిని నమ్మారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న వారికి చీమకాలంత పనికూడా చేయలేదని విమర్శించారు. ఇప్పటికే ఎన్నో ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు ఇంకా వాళ్లకు ఇచ్చిన హామీల కోసం ఉద్యమాలు చేయాలా? అని ప్రశ్నించారు. ఇక వారికి ఆమరణ దీక్ష ఒక్కటే మిగిలిందన్నారు. ఉద్యమకారుల కోసం తాము భూపోరాటం చేస్తే ఉద్యమకారులపై లాఠీలు ఝుళిపించారని కవిత గుర్తుచేశారు. ఉద్యమకారుల జీవితాలు ఇప్పటికే ఆగమాయయ్యాని వారిపై లాఠీలు ఝుళిపిస్తే లాభమెంటనీ ప్రశ్నించారు. తెలంగాణ జన సమితి తరఫున ఉద్యమకారులకు ఐటెంటీలు కార్డులు ఇచ్చిన కోదండ రాం సార్ వాటినే ఇప్పుడు ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వటం లేదో చెప్పాలన్నారు. ఆయన ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారని ఉద్యమకారులకు మేలు చేయాలని కోరారు. కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు

మేలు చేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇప్పటికే ఎంతో మంది ఉద్యమకారుల డేటా ప్రభుత్వం వద్ద ఉందని కవిత అన్నారు. ఉద్యమకారులకు మేలు చేసేలా నిర్ణీత కాల వ్యవధితో కూడిన వాగ్దానాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చేయాలన్నారు. లేదంటే కాంగ్రెస్ నేతలను రాష్ట్రంలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## విధ్వంసానికి రెండోవైపు..



గైరాంగ్: మెరుపు వరద వెల్లువకు టిబెట్-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ కౌంటీలో ఎలాంటి భీతావహ వాతావరణం నెలకొందో తెలిపే వీడియోను చైనా తొలిసారిగా ఆదివారం విడుదల చేసింది. ఇంతవరకు పెను విధ్వంసాన్ని నేపాల్ సరిహద్దువైపు నుంచే చూడటం సాధ్యమైంది. ఇప్పుడు రెండోవైపు నుంచి తెలుస్తోంది. ఆగస్టు 26న మెరుపు వరదల ధాటికి బురద, రాళ్లు, వ్యర్థాలు కొన్ని సెకన్ల వ్యవధిలో ఇమిగ్రేషన్ కేంద్రాన్ని ముంచేసిన తీరు దీనిలో మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రకృతి ప్రకోపానికి మానవ జీవితాలు, మౌలిక సదుపాయాలు ఎలా ప్రభావితమవుతాయన్నది వెన్ను జలదరించేలా ఈ దృశ్యాలు చాటుతున్నాయి. చిన్నపాటి ఆనవాలు మిగలకుండా ఇమిగ్రేషన్ భవనం మొత్తం కొట్టుకుపోయింది. ఒకప్పుడు అది కచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందనేది తెలుసుకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. భూమి నుంచి పొడుచుకువచ్చినట్లున్న కొన్ని చువ్వలను బట్టి అక్కడ ఒకప్పుడు భవనం ఉండేదని భావించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ భవనం గేటుగా భావిస్తున్నచోట చైనావైపు ఒక తాత్కాలిక స్మారకాన్ని నెలకొల్పారు. సరిహద్దును గుర్తించడానికి రెండు దేశాల జెండాలను పాతారు. వరదల ప్రళయానికి 43 మంది మృతి చెందగా 261 మంది విదేశీయులు సహా 519 మంది గల్లంతయ్యారని చైనా తెలిపింది. వీరిలో 49 మంది భారతీయులు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా విధ్వంసమే

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్ అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోందని, ఏమీ చేయలేక తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమై అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పాలన చేతకాకే తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉద్ధృతంగా పోరాటం చేయాలని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై ప్రజల వద్దకు వెళ్దామన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, సాగునీటి కోసం మరో యుద్ధానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. లక్షల మందితో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని, ఆ జల ఉద్యమానికి తానే నేతృత్వం వహిస్తానని స్పష్టం చేశారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా నిలదీయాలని, సమావేశాల్లో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని సూచించారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ప్రజల ఎజెండానే భారాస ఎజెండాగా ఉండాలని వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందన్నారు.

**కాళేశ్వరంపై కుట్రలు తేలిపోయాయి**

"తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టులపై చేసినవి దుష్ప్రచారాలే అని.. కుట్రపూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైపోయింది. మేడిగడ్డ దగ్గర చిన్న మరమ్మతు చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే.. దాదాపు 13 జిల్లాల్లో రైతాంగం పంటలు పండించుకుంటారు. మరి ఎందుకు ఆ ప్రయత్నం చేయట్లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలి? భారాస హయాంలో 90% పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా.. ఉమ్మడి నల్గొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు సాగునీరు, తాగునీటిని ఎందుకు



అందించలేకపోతున్నారు?

**అన్ని అంశాలపై ప్రజల పక్షాన ప్రశ్నించాలి**

వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలను, హామీలను వెయ్యి రోజులైనా నెరవేర్చడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందో ప్రజల పక్షాన ప్రశ్నించాలి. పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా.. పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లల వివాహాలు, దవాఖానా ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తమ భూమిని అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు గోసపడుతున్నారు. పాలిటెక్నిక్ విద్యను భ్రష్టుపట్టించేలా తీసుకొచ్చిన జీవో నం.97పై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి. తొలిఏడాదే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. యువత ఆందోళనకు మద్దతుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఫ్యూచర్ సిటీ పేరిట ప్రభుత్వం నిర్వహిస్తోన్న రియల్ ఎస్టేట్ దందాను అసెంబ్లీ వేదికగా నిలదీయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, సింగరేణి కుంభకోణాలు, మెట్రోరైలుపై అనాలోచిత నిర్ణయాలు, ఇష్టారీతిన ప్రభుత్వ భూముల అమ్మకాలు, గురుకులాల్లో సమస్యలు, శాంతిభద్రతలు అదుపు తప్పడం, ఉద్యోగులు, పింఛనుదారుల ఇబ్బందులు, తదితర అంశాలపై ఎండగట్టాలి" అని కేసీఆర్ పేర్కొన్నారు. "తెలంగాణకు భాజపా చేసింది, చేస్తున్నది శూన్యం. దిల్లీలో జెన్ జీ ఆందోళన ప్రభావం ఆ పార్టీపై చాలా పడింది. దాన్ని అధిగమించేందుకు నియోజకవర్గాల పునర్విభజన చేస్తుంది. భాజపా వ్యతిరేక వైఖరిని కూడా గట్టిగా వినిపించాలి" అని కేసీఆర్ సూచించారు.

**మీరు సభకు రానవసరం లేదు సర్!**

**కేసీఆర్‌కు ఎమ్మెల్యేల వినతి**

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని.. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సీఎం సహా కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శల అంశం భారాస ఎల్పీ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. "సభల్లో సమస్యలపై చర్చ చేయడం లేదు. తిట్లనే నమ్ముకున్నారు. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇంత అనుచిత వ్యాఖ్యల దుస్థితి ఎప్పుడూ లేదు. అలాంటి సభకు మీరు రానవసరం లేదు" అని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

# 22ఏ సమస్య ఎందుకొచ్చింది?



హైదరాబాద్: భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. "గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొంటూ.. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉత్పన్నమయ్యాయి.. ఏ మేరకు పరిష్కరించామనే వివరాలను కూడా ఆయన సీఎంకు తెలిపారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య కనిపించిందని.. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని ఆదేశించారు. సమావేశానికి పలువురు కలెక్టర్లు హాజరయ్యారు.

**మంత్రి పొంగులేటి సమీక్ష**

నిషేధిత భూముల జాబితా అంశం శాసనసభ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్తులు కూడా ఆ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి, కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది సభలో మంత్రి వివరించనున్నట్లు తెలిసింది. ఆదివారం ఈ అంశాలపై మంత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారు. 22ఏ జాబితాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఆ జాబితాలో ఉన్నాయంటూ పలుచోట్ల భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించారు. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 980 వచ్చాయి. వీటి పరిష్కారానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల కార్యదర్శులతో ప్రభుత్వం హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శాసనసభలో విపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది. సభ్యులు 22ఏ సంబంధిత ప్రశ్నలు వేస్తే వాటికి సరైన జవాబు అందించే విధంగా జిల్లాల వారీగా పూర్తి సమాచారాన్ని తెప్పించింది.

**పట్టాల పంపిణీపైనా..**

రాష్ట్రంలో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు లేని రైతులకు ఇటీవల పట్టాలు పంపిణీ చేశారు. సమీక్షలో ఈ అంశంపైనా చర్చించినట్లు తెలిసింది.

# సమగ్ర గ్రంథం.. సూక్ష్మ అర్థశాస్త్రం (మైక్రో ఎకనామిక్స్).

**భావనల నుంచి అనువర్తనాల వరకు సమగ్ర అవగాహన**

**విద్యార్థులు సులభంగా అర్థం చేసుకొనే విధంగా రూపకల్పన.**

**సంపాదకులుగా ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్ కృషి అభినందనీయం.**

**పుస్తక సమీక్ష.**

**వేగుచుక్క న్యూస్:**

"సూక్ష్మ అర్థశాస్త్రం -- భావనలు, సూత్రాలు, అనువర్తనాలు" అనే ఈ పుస్తకం తెలంగాణలోని డిగ్రీ విద్యార్థుల కోసం రూపొందించబడిన ఒక ఉపయోగకరమైన, సమగ్ర ఆర్థికశాస్త్ర గ్రంథం. తెలంగాణ 2025--26 నూతన సిలబస్‌కు అనుగుణంగా ఈ పుస్తకాన్ని రూపొందించడం దీని ప్రత్యేకత. ఈ పుస్తకానికి సంపాదకులుగా ప్రొఫెసర్ ఎం. ఏ. మాలిక్ వ్యవహరించడం విశేషంగా ప్రశంసించదగిన అంశం. ఆర్థికశాస్త్ర బోధనలో ఆయనకు ఉన్న విస్తృత అనుభవం, విద్యార్థుల అవసరాలపై అవగాహన ఈ గ్రంథ రూపకల్పనలో స్పష్టంగా కనిపిస్తుంది.

**ప్రొఫెసర్ ఎం. ఏ. మాలిక్ సంపాదకత్వం -- ప్రత్యేకత**







ప్రొఫెసర్ ఎం. ఏ. మాలిక్ సంపాదకత్వంలో రూపొందిన ఈ పుస్తకం కేవలం పాఠ్యాంశాలను అందించే గ్రంథంగా కాకుండా, విద్యార్థులు మైక్రో ఎకనామిక్స్ భావనలను సులభంగా అర్థం చేసుకొని, వాటిని విశ్లేషించి, పరీక్షల్లో సమర్థవంతంగా సమాధానాలు రాయడానికి సహాయపడే విధంగా రూపొందించబడింది.

సూక్ష్మ ఆర్థికశాస్త్రంలోని డిమాండ్, సప్లై, వినియోగదారు ప్రవర్తన, ఉత్పత్తి, వ్యయాలు, మార్కెట్ నిర్మాణాలు, ధర నిర్ణయం వంటి ముఖ్యమైన అంశాలను సులభమైన భాషలో, అవసరమైన సిద్ధాంతాలు మరియు గ్రాఫ్‌లతో వివరించడం పుస్తకానికి బలమైన అంశం.

**విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకం**

ఈ గ్రంథం యొక్క మరో ముఖ్యమైన లక్షణం భావనలు - - సూత్రాలు -- అనువర్తనాలు అనే దృక్పథం. ఆర్థిక సిద్ధాంతాలను కేవలం నిర్వచనాలకే పరిమితం చేయకుండా, వాటి ప్రాయోగిక ప్రాధాన్యతను కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా అందించే ప్రయత్నం కనిపిస్తుంది. అలాగే, ఎండ్-ఆఫ్-సెమిస్టర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమైన ప్రశ్నలు, పునశ్చరణకు ఉపయోగపడే అంశాలు, పరీక్షా ప్రయోజనకరమైన కంటెంట్‌ను పొందుపరచడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది.

**సమగ్రంగా**

ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్ సంపాదకత్వంలో రూపొందిన "బిఏ ఎకనామిక్స్ - సెమిస్టర్: మైక్రో ఎకనామిక్స్" పుస్తకం ప్రస్తుత సిలబస్ అవసరాలకు అనుగుణంగా, విద్యార్థి కేంద్రిత దృక్పథంతో రూపొందిన మంచి పాఠ్యగ్రంథంగా చెప్పవచ్చు. ఉపాధ్యాయులకు బోధనలో, విద్యార్థులకు అభ్యసనలో, అలాగే పరీక్షల సిద్ధతలో ఇది ఒక ఉపయోగకరమైన సహాయక గ్రంథంగా నిలుస్తుంది. ఆర్థికశాస్త్ర విద్యను మరింత సులభతరం చేసి, విద్యార్థుల్లో ఆర్థిక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ప్రొఫెసర్ ఎం. ఏ. మాలిక్ సంపాదకత్వంలో వెలువడిన ఈ గ్రంథం ఒక అభినందనీయమైన ప్రయత్నం. ప్రొఫెసర్ ఎం. ఏ. మాలిక్ కి మరియు సహ రచయితలకు హృదయపూర్వక అభినందనలు.

# ఎంత జీతం ఉంటే బ్యాంకులు ఈజీగా పర్సనల్ లోన్స్ ఇస్తాయి..? ఈ రూల్స్ గురించి తెలుసుకోండి..





అత్యవసర ఆర్థిక అవసరాలు ఏర్పడినప్పుడు అందరికీ టక్కున గుర్తొచ్చేది పర్సనల్ లోన్. ఎలాంటి ఆస్తులు లేదా పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకపోవడంతో లోన్ తీసుకునేవారి సంఖ్య ఎక్కువైంది. అయితే దరఖాస్తు చేసిన వెంటనే బ్యాంకులు అంత ఈజీగా రుణాలు మంజూరు చేయవు. ముఖ్యంగా రికవరీకి ఎలాంటి హామీ ఉండదు కాబట్టి దరఖాస్తుదారుడి తిరిగి చెల్లించే సామర్థ్యంపై బ్యాంకులు కఠినమైన తనిఖీలు నిర్వహిస్తాయి. క్రెడిట్ స్కోర్, వయస్సు, ఉద్యోగ స్థిరత్వంతో పాటు ప్రధానంగా కనీస నెలవారీ ఆదాయం, డెట్ టు ఇన్‌కమ్ రేషియోను బ్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటాయి. అసలు ఋ× నిష్పత్తి అంటే ఏమిటి? ఇది ఎందుకు కీలకం? వ్యక్తిగత రుణం మంజూరు ప్రక్రియలో రుణ-ఆదాయ నిష్పత్తి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఒక వ్యక్తి సంపాదిస్తున్న నెలవారీ ఆదాయంలో ఇప్పటికే ఉన్న పాత రుణాల జువీ×లు చెల్లించడానికి ఎంత శాతం వెళ్తోందో లెక్కించే విధానమే ఈ ఋ×. ఉదాహరణకు.. ఒక వ్యక్తి నెలవారీ జీతం రూ.50,000 ఉండి, అతను ఇప్పటికే ఉన్న రుణాల కోసం నెలకు రూ.12,500 ఈఎంఐ చెల్లిస్తుంటే, అతని ఋ× నిష్పత్తి 25శాతంగా లెక్కించబడుతుంది. సాధారణంగా ఋ× నిష్పత్తి 35శాతం లేదా అంతకంటే తక్కువ ఉంటే బ్యాంకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే లోన్ మంజూరు చేస్తాయి. 40 నుంచి 45శాతం ఋ× ఉంటేలి కొన్ని బ్యాంకులు రుణం ఇచ్చేందుకు అంగీకరించినా.. కో-అప్లికెంట్ లేదా గ్యారెంటర్‌ను పెట్టాలని కోరడం, లోన్ మొత్తం తగ్గించడం లేదా కాలపరిమితిని పెంచడం వంటి కఠిన షరతులు విధిస్తాయి. ప్రముఖ బ్యాంకుల్లో కనీస ఆదాయ పరిమితులుపర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వివిధ బ్యాంకులు నిర్దేశించిన కనీస నెలవారీ జీత ప్రమాణాలు ఇలా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బపరిగణనలోకి తీసుకుంటారు. యాక్సిస్ బ్యాంకులో ఇప్పటికే ఖాతా ఉన్నవారికి కనీస పరిమితి రూ.15,000. కొత్త కస్టమర్లకు అయితే కనీసం రూ.25,000 ఉండాలి. కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత కస్టమర్లకు రూ.25,000, ఇతర బ్యాంక్ ఖాతాదారులకు రూ.30,000. అదే కోటక్ ఉద్యోగులైతే రూ.20,000 కనీస జీతం ఉండాలి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ, రక్షణ రంగ ఉద్యోగులకు కనీస వేతనం రూ.20,000. కార్పొరేట్ ఉద్యోగులకు కనీస జీత పరిమితి రూ.25,000 గా నిర్ణయించారు. కేవలం అధిక జీతం ఉండటమే కాకుండా, గతంలో తీసుకున్న ఈఎంఐల భారం తక్కువగా ఉన్నప్పుడే ఎక్కువ మొత్తం పర్సనల్ లోన్ తక్కువ వడ్డీకే లభించే అవకాశం ఉంటుంది. అందుకే లోన్ కోసం అప్లై చేసేముందే మీ సిబిల్ స్కోర్, నెలవారీ ఈఎంఐల శాతాన్ని ఒకసారి సరిచూసుకోవడం మంచిది.



# ఇషాన్ అజేయ శతకం

## సౌత్‌తో దులీప్ ట్రోఫీ ఫైనల్

ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్‌కు అదిరే ఆరంభం. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111 బ్యాటింగ్; 135 బంతుల్లో 14ఐ4, 1ఐ6) అజేయ శతకం బాదడంతో మొదటి రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. శిఖర్ మోహన్ (85), అభిమన్యు ఈశ్వరన్ (72), కుమార్ కుశాగ్ర (63 బ్యాటింగ్), వైభవ్ సూర్యవంశీ (44) కూడా రాణించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు అభిమన్యు, వైభవ్ తొలి వికెట్‌కు 100 పరుగులు జోడించారు. అయితే ఈ ఓపెనర్లతో పాటు సుదీప్ కుమార్ (6) కొద్ది తేడాలో ఔట్ కావడంతో ఈస్ట్ 147/3తో నిలిచింది. మరో వికెట్ పడుంటే ఆ జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారేదే. ఈ దశలో ఇషాన్.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దూకుడైన ఆటతో స్కోరు బోర్డును నడిపించాడు. చక్కని షాట్లతో అలరించిన అతడు.. 71 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. మరో 51 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్‌కు శిఖర్ మోహన్, కుశాగ్ర చక్కని సహకారాన్నిచ్చారు. శిఖర్‌తో నాలుగో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్.. కుశాగ్రతో అభేద్యమైన అయిదో వికెట్‌కు 144 పరుగులు జోడించాడు. సౌత్‌జోన్ బౌలర్లలో చామా మిలింద్ (2/56) రాణించాడు.

# ఓటమిని తప్పించుకున్న భారత్

## జపాన్‌తో మ్యాచ్ డ్రా

## జూనియర్ ఆసియాకప్ హాకీ

**చైనా:** జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ఇండోనేసియాను 14-0తో చిత్తు చిత్తుగా ఓడించిన భారత పురుషుల జట్టు.. ఆదివారం జపాన్‌తో రెండో మ్యాచ్‌లో కొద్దిలో ఓటమిని తప్పించుకుంది. ఆఖరి నిమిషంలో గోల్‌తో 3-3తో డ్రా చేసుకుంది. పూల్-ఎ పోరులో ఆరంభంలో ఆధిక్యంలో కొనసాగిన అన్మోల్ బృందం.. తర్వాత పట్టు కోల్పోయి ప్రత్యర్థికి పుంజుకునే అవకాశాన్ని ఇచ్చింది. తొలి క్వార్టర్ మొదట్లో పెనాల్టీ స్ట్రోక్‌తో అన్మోల్ (4వ నిమిషం) గోల్ కొట్టడంతో భారత్ 1-0తో నిలిచింది. కాసేపటికే ఆధిక్యం రెట్టింపైంది. అషు మౌర్య (10వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేశాడు. కానీ జపాన్ వెంటనే పుంజుకుంది. రయుషిన్ ససాకి (11వ) గోల్‌తో 1-2తో నిలిచింది. తర్వాతి రెండు క్వార్టర్లలో భారత్-జపాన్ గోల్స్ కోసం గట్టిగానే పోరాడినా ఫినిషింగ్ చేయలేకపోయాయి. ఆఖరి క్వార్టర్‌లో కెప్టెన్ నకనిషి (48వ) సఫలం కావడంతో జపాన్ స్కోరు సమం చేసింది. కాసేపటికే ఆ జట్టు ఖాతాలో మరో గోల్ చేరింది. నకనిషి (59వ) గోల్‌తో జపాన్ 3-2తో విజయానికి చేరువైంది. ఇంకో 59 సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ దక్కింది. ఆ అవకాశాన్ని కెప్టెన్ అన్మోల్ సద్వినియోగం చేసి భారత్‌ను ఓటమి నుంచి బయటపడేశాడు. మంగళవారం కొరియాతో భారత్ తలపడనుంది.

అమ్మాయిలకు ఘనవిజయం: మహిళల జూనియర్ ఆసియాకప్ టోర్నీలో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన



పోరులో 11-1తో మలేసియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. గోల్ మీద గోల్ కొట్టింది. తొలి నిమిషం నుంచి ఆఖరిదాకా అదే జోరు కొనసాగించింది. పూజ సాహో (1వ, 42వ), పూర్ణిమ యాదవ్ (4వ, 17వ), గీత యాదవ్ (28వ, 53వ), సనిక మానె (43వ, 58వ) రెండేసి గోల్స్ కొట్టగా.. బినిమా ధాన్ (8వ), కృష్ణ శర్మ (14వ), సుఖ్‌వీర్ కౌర్ (21వ) ఒక్కో గోల్ సాధించారు. మలేసియా తరఫున ఏకైక గోల్‌ను నూర్ మహ్మద్ (38వ) చేసింది.



## మాతోపాటు మీరు ఎంజాయ్ చేస్తారు

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ.. 'నీ పరిచయం సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ సాంగ్ షూటింగ్ చేసేప్పుడు మేము చాలా ఎంజాయ్ చేశాం. అలాగే మీరూ ఈ పాటను ఆస్వాదిస్తారని అనుకుంటున్నాను. రావులపాలెంలో ఈ పాట చిత్రీకరణ జరిగింది. అక్కడ షూటింగ్ చేసినన్ని రోజులు స్థానిక ప్రజలు ఎంతో ప్రేమను చూపించారు. బొబ్బట్లు, చేపలు తీసుకొచ్చి ఇచ్చేవారు. వాళ్ల నిస్వార్థ ప్రేమను చూశాం. అనూప్ గారు మాకు బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. ఇలాగే మీ సపోర్ట్ మా మూవీకి ఉండాలని కోరుకుంటున్నా' అని ఆనందం వ్యక్తం చేసింది.



## సౌత్ ఇండస్ట్రీ నాపై చూపించిన దయ ఎప్పటికీ మరువలేను

### శ్రియా శరణ్ ఆసక్తికర కామెంట్స్

ఒకప్పుడు సౌత్ ఇండియన్ సినిమాలో స్టార్ హీరోయిన్‌గా ఏలిన అందాల భామ శ్రియా శరణ్, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. గత కొద్దికాలంగా హీరోయిన్ అవకాశాలు తగ్గినప్పటికీ, సరైన పాత్రలను ఎంచుకుంటూ ఆవారాపన్-2' తో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'దృశ్యం-3' అక్టోబర్ 2న విడుదల కానుంది. దీంతో పాటు శ్రియా చంద్రయాన్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఒక ప్రతిష్టాత్మక వెబ్ సిరీస్‌లో యామిని ముదలియార్ అనే ఎంతో పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియ, సౌత్ ఇండస్ట్రీ, దర్శకధీరుడు రాజమౌళి గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సౌత్ పరిశ్రమ గురించి శ్రియ మాట్లాడుతూ.. "సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీ నా పట్ల ఎంతో ఆదరణతో, దయతో వ్యవహరించింది. ఈ పరిశ్రమ నాకు అపారమైన ప్రేమను అందించడమే కాకుండా, ఒక నటిగా నన్ను నిలబెట్టడానికి ఎన్నో గొప్ప అవకాశాలను ఇచ్చింది. ఇక్కడ నాకు దక్కిన ఆదరణ ఎప్పటికీ మరువలేనిది" అని ఎంతో సంతోషంగా చెప్పారు. ఇక దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి గురించి చెప్తూ.. "షూటింగ్ సమయంలో ఆయన చూపించే తీవ్రత, ఆయనకున్న విజన్ నిజంగా అద్భుతం. అంతటి గొప్ప విజన్‌తో సినిమాలు తీయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారు, కానీ రాజమౌళి గారు తన ఆలోచనలకు, ఊహలకు తెరపై అద్భుతమైన రూపం ఇస్తారు. ఒక చిత్రనిర్మాతగా ఆయనలోని అభిరుచి, వర్క్ పట్ల ఉండే డెడికేషన్ మరో స్థాయిలో ఉంటాయి. ఎంతటి పెద్ద కలనైనా ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభవంగా మార్చగల అరుదైన సామర్థ్యం ఒక్క రాజమౌళి గారికి మాత్రమే సొంతం" అని శ్రియ ప్రశంసల వర్షం కురిపించారు.



యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. ఇటీవల వచ్చిన 'లెనిన్' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ ఒక్క సినిమా విజయంతో అమ్మడి రేంజ్, క్రేజ్ పూర్తిగా మారిపోగా.. వరుస ఆఫర్లు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భాగ్యశ్రీ మలయాళంలో ఓ బంపర్ అందుకున్నట్లు వార్తలు రాగా.. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది. మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ హీరోగా, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై విష్ణు మోహన్ దర్శకత్వంలో ఓ బిగ్ ప్రాజెక్టు రాబోతున్నది. ఈ

## మలయాళ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే

సినిమాకు 'ఆపరేషన్ గంగా – ఎ నేషన్స్ ప్రామిస్' అనే టైటిల్ ఖరారు చేస్తూ అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. గోకులం గోపాలన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆర్. పార్తీపన్, ఆదిల్ హుస్సేన్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇక ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే మలయాళ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.